# వెలుగుల తీరం

సింహప్రసాద్



# వెలుగుల తీరం

విశ్వసాహితి, శ్రీ త్యాగరాయ గానసభ (హైదరాబాద్) వారి
2009 ఉగాది పురస్కారం పొందిన నవల

## సింహప్రసాద్

**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్, MIG-II-650
టెంపుల్ బస్టాండు దగ్గర, కె.పి.హెచ్.బి.కాలనీ,
హైదరాబాద్ - 500 072
ఫోన్ : 23157608, 98490 61668

**VELUGULA THEERAM**
Simha Prasad
Email : Simhaprasad@yahoo.com

ముద్రణ:
**డిసెంబర్ : 2008**

వెల : రు. **60/-**

డి.టి.పి:
**బి. రత్నకుమారి**

కవర్ డిజైన్ & ప్రింటర్స్
**అనుస్వర క్రియేషన్స్**
సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్.
ఫోన్ : 98485 49158

ప్రతులకు
**అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో**

# అంకితం



అకాల మరణం పొందిన
నా మేనల్లుడు మద్దాల జగ్గారావు
అతడి భార్య మద్దాల శైలజా రత్నకుమారి
వారి గారాల పుత్రిక  బేబీ సృజనల
స్మృతికి...

**– రచయిత**

## *కృతజ్ఞతలు*

ఈ నవలను 1999లో సీరియల్‌గా
ప్రచురించిన **'చెలిమి'** వారపత్రిక
సంపాదకులకు...

**– రచయిత**

# వెలుగుల తీరం

"హాయ్ డాళింగ్!"

"ఎవరూ... సలీం?"

"షిట్. ఖూనీ!"

"సారీ డియర్..."

"అలా పిలిచేవాళ్ళు నేనుగాక ఇంకెవరైనా ఉన్నారా?"

"జెలసీ వద్దుగాని ఈ అకాల ఫోన్ పలకరింపులోని ఆంతర్యం ఏమిటో?!"

"ఈ మధ్య నిన్ను చాలా మిస్సయ్యాను మేఘనా"

"రావొచ్చుగా"

"రెక్కల కోసం చూస్తున్నాను. దొరికివుంటే ఎప్పుడో వచ్చి నీ ఒళ్ళో వాలి ఉండేవాడ్ని యార్"

"ఎలా ఉంది నీ ప్రాక్టీసు?"

"గ్రేట్. ఈసారి టైటిల్‌నాదే. ఎలా వుంది మన సైబరాబాదు?"

"సిటీ ఆఫ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జెస్‌గా మారుతోంది"

"దట్ నాయుడూ ఈజ్ డూయింగ్ వెల్"

"పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువ"

"నువ్వెప్పుడూ ఇంతే. ఎవర్నీ మెచ్చుకోవుకదా. నీలో నాకు నచ్చని పాయింటు అదే"

“లెటిట్ బీ. నాకు నేను నచ్చుతాను. నాకు నచ్చేదే నేను చేస్తాను. నాకోసమే నేను బతుకుతాను.

“బుద్ధొచ్చింది. తెలీక తేనెతుట్టని కదిపాను”

“ఓకే ఓకే. కూల్‌డ్రింక్ యాడ్స్‌కి అడగలేదా? ఈ మధ్య డల్ అయ్యావు. ఆదాయమూ తగ్గిందనుకుంటాను.”

“మగవారి ఆదాయమూ ఆడవారి వయస్సూ పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టూ అడక్కూడదు మేడమ్”

“ఒప్పుకుంటున్నాను మహానుభావా. ప్రాక్టీసు పెంచితే మంచిదని నా సలహా”

“టెన్నిస్‌కో గోలీమారో యార్. నీకో సంగతి తెలుసా?”

“ఏ సంగతో చెప్పు ముందు”

“మీ పేరెంట్స్ నీకు మేఘన అని పేరెందుకు పెట్టారో తెలుసా?”

“నీతో చెప్పేరేవిటీ”

“యా! నామీద ప్రేమ వర్షం కురిపిస్తావని!”

ముత్యాలొలికినట్టు నవ్వింది.

“నవ్వుతావేం? నమ్మకం లేదా?”

“అంతా అదే డైలాగ్ చెప్పొచ్చుగా”

“చెబితే మొండి కత్తితో పొడిచి చంపేస్తాను. యూ ఆర్ మైన్”

“బట్ అయామ్ నాట్ యువర్స్”

“షటప్ ఐ సే....”

“రిలాక్స్ రిలాక్స్. ఎప్పుడొస్తున్నావు?”

“నెక్ట్స్‌మంత్. షూటింగులేం పెట్టుకోకు. ఇద్దరం సిటీని ఓ పట్టుపట్టాలి”

“వెల్కం. నీకో న్యూస్ సలీం”

“ఎలాంటి న్యూస్?”

“నువ్వు రిసీవ్ చేసుకునే విధానాన్ని బట్టి ఉంటుంది.”

"సస్పెన్స్ ముడి విప్పేయ్"

"ఇంకొద్ది నెలల్లో నాకో తోడు లభించబోతోంది"

"యూ మీన్ మేరేజ్?"

"ఊహుఁ. పెళ్లి సంసారంలాంటి బంధనాల్లో ఛస్తే ఇరుక్కోను. నీకు తెలుసుగా. ఐహేట్ దెమ్"

"రక్షించావు"

"ఎవర్ని ఎవర్నుంచి?"

"నే వచ్చినప్పుడు ఫేస్ టు ఫేస్ చెబుతాన్లే. ఇంతకీ న్యూసేవిటి?"

"నాకు నెల తప్పింది"

"యూ మీన్ ప్రెగ్నెంట్?"

"ఐ మీన్ దట్"

"కంగ్రాట్స్ మేఘనా. అయితే ఈ ఫ్రీ నెస్ కొద్ది నెలలేనన్నమాట. భరిస్తాన్లే. నా అంకురాన్ని మోస్తున్నావాయె!"

"ఈ బిడ్డ నాది"

"నీదేనోయ్. కాని బీజం నాది కదా"

"గ్యారంటీ లేదు"

"నా మాటే గ్యారంటీ. సో హక్కులూగట్రా నావే అవుతాయి"

"అవ్వనీను"

"నువ్వే చూస్తావుగా. నా పోలికలే వస్తాయి. వాడూ టెన్నిస్ ప్లేయరే అవుతాడు"

"పాపనే కంటాను"

"నో. అబ్బాయే పుడతాడు. బెట్!"

"అప్పుడు అబార్షన్ చేయించుకుంటాను"

"నీదంతా తలతిక్క వ్యవహారం. సరే నేవచ్చినప్పుడు తాపీగా మాట్లాడు కుందాంలే"

"ఒకే బై...."

రిసీవర్ పెట్టేసింది మేఘన.

తనకి తెలీకుండానే ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యింది. గుండెల మీంచి పెద్ద బరువేదో దిగిపోయినట్లన్పించింది.

'ఇహ మిగతావారి రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి!' సాలోచనగా అనుకుంది.

ఆమె దృష్టి హాలులో తగిలించివున్న సలీం నిలువెత్తు ఫొటో మీద పడింది.

అతడు టెన్నిస్ ఆడుతూండగా తీసిన ఫొటో అది. అందులో అతడు బాల్‌కోసం ఎదురుచూస్తూ బాటింగుకి రెడీగా ఉన్నాడు.

భారత టెన్నిస్ ప్లేయర్లలో సలీం స్థానం ప్రత్యేకమైంది. గతంలో ఎన్నో టైటిల్స్‌ని గెల్చుకొచ్చాడు. ఈ మధ్య ఎంచేతో మునుపటి ప్రతిభ ప్రదర్శించలేక పోతున్నాడు. శ్రద్ధ తగ్గిందన్న విమర్శలు మొదలయ్యాయి.

సలీం ఉక్కుముక్కలా వుంటాడు. అందంగా ఉంటాడు. నవ్వుతూ ఉంటాడు. నవ్విస్తూ ఉంటాడు.

లక్షలార్జిస్తున్నాడు. వడ్డించిన విస్తరి అతడి జీవితం.

సిటీకి చెందినవాడే అయినా ప్రస్తుతం ముంబాయిలో సెటిలయ్యాడు.

ఒకప్పుడామె అతడి వీరాభిమాని. అతడికోసం ప్రాణాలైనా ఇవ్వగలిగేంత పిచ్చి.

ఆ అభిమానమే ఇద్దర్నీ దగ్గరచేసింది.

చేరువయ్యాక అతడ్ని ఆటగాడిగా ఆరాధించడం మానేసింది. దూరపు కొండల నునుపుదనం తెలియడం ఓ కారణం!

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

"హలో..."

"సలీంని. ఇందాక ఒక పాయింటు చెప్పడం మర్చిపోయాను"

"దేని గురించి?"

"పొరబాటున కూడా నాపేరు బయటపెట్టకు సుమా. అసలే మన గురించి గాసిప్స్ చాలా రాస్తున్నారు. ఇప్పుడీ సంగతి బయటపెడితే నా ఇమేజ్ దెబ్బతింటుంది. నా ఫాన్స్ హర్ట్ అవుతారు..."

"చెప్పే ఉద్దేశం లేదు"

"థాంక్ గాడ్. నా పర్మిషన్ లేకుండా నీ బిడ్డకి నేనే తండ్రినని ఎప్పుడూ ఎక్కడా చెప్పొద్దు. ఓకే?"

చిత్రంగా నవ్వింది.

"నవ్వుతావెందుకు?"

"తల్లి సత్యం. తండ్రి ఓ నమ్మకం!"

"నాకేం అర్థంగావట్లేదు"

"మగాడివి కదా!"

"వాదించే టైంలేదు. బై..."

రెండేళ్ళనుంచి స్నేహంగా ఉంటోన్నా తనేమిటో తెలుసుకోలేకపోయాడు!

ఆ వెంటనే ఉలిక్కిపడింది.

తెలుసుకో లేకపోయాడా లేక తెలుసుకోదలచలేదా?

'చోడోయార్' భుజాలు ఎగరేస్తూ అనుకుంది.

కిచెన్లోకెళ్ళింది.

కూర చేసే ఓపికలేదు. ఆమ్లెట్ వేసింది. ప్రియా సాయంతో భోజనం అయ్యిందన్పించింది.

జీన్స్‌ఫాంటూ టీషర్టూ ధరించింది. పొట్టి జుట్టుని దువ్వి రెక్లెస్‌గా రబ్బర్ బాండ్ తగిలించింది.

దినపత్రికలో ఇవ్వాల్సిన పేపర్లూ హేండ్‌బేగ్గూ తీసుకుని బయల్దేరుతోంటే ఫోన్ రింగయ్యింది.

"మేఘనా..." లైన్లో హిమాంశుగారు.

ఆయనో ఇండో ఆంగ్లికన్ రైటర్. రెగ్యులర్‌గా కొన్ని పత్రికలకి ఫీచర్స్ రాస్తూంటారు. విదేశీ పబ్లిషింగ్ హౌసెస్‌కి ఎడ్వైజర్ కూడా.

మేఘనకి డిటీపి వచ్చు. ఆయన రాసిన మాన్యుస్క్రిప్టుల్ని టైపు చేసిస్తూంటుంది.

"చెప్పండి.. అంకుల్"

"కొంత మేటరుంది. ఏదో టైములో వచ్చి కలెక్టు చేసుకో"

"అలాగే అంకుల్"

"రేపటికి అయిపోవాలి సుమా"

"అయిపోతుంది అంకుల్"

"దట్స్ గుడ్"

వాచీ వంక చూసింది. పదీ పది.

"టైం సరిపోతుందిలే"

ఎపార్ట్‌మెంట్‌కి తాళం వేస్తోంటే, "ఉండుండు" అంటూ వచ్చిపడ్డాడు రామారావు.

అతడు నల్లగా బక్కగా టీబీ పేషంట్లా ఉంటాడు. ఎప్పుడూ గెడ్డం మాసే ఉంటుంది. పదిపన్నెండేళ్ళ నుంచి సినిమాలకి అసిస్టెంటు డైరెక్టరుగా, కో–డైరెక్టరుగా పని చేస్తున్నాడు. అయినా అతడూ అతడి సంపాదనా గొట్టెతోకే!

"ఈ టైంలో ఊడిపడ్డావేమిటి" తలుపు తెరుస్తూ అంది మేఘన.

" మా గురుడు పని రాక్షసుడు కదా. మళ్ళీ కాంబినేషన్ డేట్లు దొరకవని రాత్రంతా లాగించాడు. పేకప్ చెప్పేక తిన్నగా ఇటొచ్చాను. ఇవాళంతా కరువుతీరా నిద్రపోవాలి" ఆవులిస్తూ అన్నాడు.

"నీ ఇష్టం. అన్నం ఉంది గాని కర్రీ లేదు. ఎగ్స్ ఉన్నాయిలే. ఆమ్లెట్ వేసుకున్నా సరే పచ్చడితో ఎడ్జెస్ట్ అయినాసరే"

"నా తిప్పలు నేను పడతాన్లే. షూటింగుందా?"

"లెవెన్‌కి"

అతడి ముఖం అప్రసన్నంగా మారింది.

"ఆకలిగా ఉంది. అర్జంటుగా తినడానికేమైనా ఉందా"

"బ్రెడ్డూ జామూ ఉన్నాయి" ఫ్రిజ్‌లోంచి తీసి డైనింగ్ టేబుల్ మీద పెడుతూ అంది.

బ్రెడ్‌కి జామ్ రాసుకుంటూ "మా ఇంటికెళ్తే ఏదో టిఫిన్ ఉండేది" అన్నాడు.

"నే వెళ్ళొద్దన్లేదు కదా" చటుక్కున అంది.

"ఇంటి నిండా బంధువులు దిగబడ్డారు. ఏదో ఆసుపత్రిలో చూపించుకోవాలట. ఇంట్లో నిలబట్టానిక్కూడా చోటుండదు"

"నే వెళ్తానిహ టైమవుతోంది"

"వెళ్దువుగాన్లే. ఇవాళేమిటి విశేషం ముఖం వెలిగిపోతోంది. ఏదైనా టీవీ సీరియల్‌కి సైన్ చేశావా?"

"లేదులే. ఒక విశేషముంది"

"నాకు చెప్పకూడదా?"

"నేను తల్లిని కాబోతున్నాను"

తుళ్ళిపడి చూశాడు.

అతడి బికారి ముఖంలోకి కాంతి గుప్పున త్రోసుకొచ్చింది.

"మళ్ళీ చెప్పు..."

"తెలుగులోనే చెప్పేను మహానుభావా"

"కాదు. మళ్ళీ చెప్పు..." ఎక్సైట్ అవుతూ అడిగాడు.

"అయామ్ కేరీయింగ్"

"రియల్లీ?" తింటున్నదాన్ని వదిలేసి ఆమె ముందుకొచ్చాడు.

"యస్"

"ఓహ్...!" ఆమెని అమాంతం ఎత్తేసి గిరగిరా త్రిప్పేశాడు.

"చాలు చాలు. నిజ జీవితంలో ఎవ్వరూ ఇలా చెయ్యరు. మన సినిమావాళ్ళకి ఇలా తప్ప ఇంకోలా చూపడం తెలీదు!"

ఆమె మాటలు పట్టించుకోకుండా అన్నాడు "నాకు చాలా చాలా ఆనందంగా ఉంది మేఘనా. నాకు డైరెక్షన్ ఛాన్స్ వచ్చినా ఇంత ఆనందపడే వాడ్ని కాదనుకో"

"సాయంత్రం తీరిగ్గా మాట్లాడుకుందాం"

"ఇంతగొప్ప వార్త చెప్పేక నీనోటిని తీపి చెయ్యొద్దూ. ఇంట్లో స్వీట్స్ లేవా!"

"నీకు సుగర్ కదా"

"నువ్వు తింటే నేను తిన్నట్టే. పోనీ సుగర్ ఇవ్వు"

అతడ్ని నిరుత్సాహపరచలేకపోయింది. సుగర్ డబ్బా అందిచ్చింది. రెండు చెంచాలు అరచేతిలో పోసుకుని ఆమె నోట్లో పోశాడు.

"నాకు పిల్లల్లేరని బంధువులంతా ఏదేదో అనుకుంటున్నారు. ఇక వాళ్ళందరి నోళ్ళూ బంద్ అవుతాయి. ప్రొడ్యూసర్ రాజిరెడ్డి బాలెన్స్ ఇచ్చెయ్యగానే నీకు నచ్చిన చీర కొనిపెడతాను"

"చీరలు కట్టను కదా" నవ్వుతూ అంది.

"పోనీ సల్వార్‌సూట్ కొంటాన్లే. నువ్వింత స్వీట్ న్యూస్ చెబుతావనీ నా కలల్ని పండిస్తావనీ కలలో కూడా అనుకోలేదు. నాకింకే లోటూ లేదు. ఇదంతా సాయినాథుడి భిక్ష. నేను తండ్రిని కాబోతున్నాను. చాలు. ఈ జన్మకీ అదృష్టం చాలు!"

అతడు ఆనందోద్వేగంతో వూగిపోతున్నాడు.

వెర్రిగా చూసింది. కించిత్తు జాలిగానూ చూసింది!

అదేమీ గమనించే స్థితిలో లేడతడు. ఏదేదో చెప్పుకుపోతున్నాడు.

"జిడ్డేశ్వరా! నీకో నమస్కారం!" చేతులు జోడించి మరీ చెప్పి ఇంట్లోంచి బయటపడింది మేఘన.

"కీర్తి టవర్స్" లోంచి బయటికెళుతోంటే ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు ముఖం తిప్పుకున్నారు.

గేటు ప్రక్కనున్న టెలిఫోన్ బూత్ దగ్గర నిలబడ్డ మగాళ్ళు ఆశగా ఆబగా చూశారు.

వారి చూపుల్ని దులిపేసుకుంటూ చేతక్ స్టార్ట్ చేసింది.

ఒక దినపత్రిక ఆఫీసుకెళ్ళింది.

సబ్‌ఎడిటర్ దేవానంద్‌ని "నమస్కారం బాసూ" అంటూ పలకరించింది.

తను రాసి తెచ్చిన ఆర్టికల్స్ ఇచ్చింది.

మూడ్ కుదిరినప్పుడల్లా మనస్సుకి తోచిన అంశం మీద ఆర్టికల్స్ రాస్తూంటుంది. విభిన్న అంశాలని కొత్త దృక్కోణం నుంచి చూస్తూ ఆకట్టుకునేలా రాస్తుంది.

వాటికి రెస్పాన్స్ కూడా బావుంటోంది.

అయినా అతడు మొదట్లో ఎంకరేజ్ చెయ్యలేదు. విసుక్కుంటూ తీసుకునేవాడు. తోచినప్పుడు వేసుకునేవాడు. అనుకోకుండా ఓసారామె ఇంటిపేరు తెలిసింది.

దాన్నిబట్టి "అయితే మనం మనం ఒకటే నన్నమాట" అన్నాడు ఉత్సాహంగా.

అప్పట్నుంచీ ఆమె వ్యాసాలని కళ్ళకద్దుకుని మరీ ప్రచురిస్తున్నాడు. ఆకర్షణీయంగా ఉండటానికి ఏవో ఫొటోలు కూడా వేస్తున్నాడు.

"లాస్ట్‌వీక్ ఫెమినిజం మీద నువ్వు రాసిన ఆర్టికల్ బాగా పేలింది. చాలా లెటర్లొచ్చాయి. అలాటివి ఎక్కువరాయి" అన్నాడు.

"థాంక్యూ. లాస్ట్ మంత్‌కి పేమెంటివ్వలేదు బాసూ"

"ఇంకా ఇవ్వలేదా? నేను కనుక్కుంటాన్లే. రెండ్రోజుల్లో ఇప్పించే పూచీ నాది"

మరోసారి థాంక్స్ చెప్పి బయట పడింది.

ఆవరణలోని చెట్టుక్రింద సిగరెట్టు కాలుస్తూ కన్పించాడు మూర్తి. ఎవరికో దేనిమీదో ఉపన్యాసం ఇస్తున్నాడు.

పెరిగిన గెడ్డం, నలిగిన లాల్చీపైజమా, పరధ్యానపు చూపులు, అరిగిన హవాయి చెప్పులు, సగం తెల్లబడ్డ జుట్టు, భుజానికి వేళ్ళాడతూ ఓ సంచీ – ఇదీ అతడి అవతారం.

అతడు పెయింటింగ్స్ వేస్తాడు. పోర్ట్రెయిట్స్ చిత్రిస్తాడు. పత్రికల్లోని కథలకీ సీరియల్స్‌కీ చిత్రాలు గీస్తాడు. కొండొకచో కార్టూన్లు చిలకరిస్తాడు. విమర్శనా వ్యాసాలూ రాస్తాడు

తను మేధావినని అతడి ప్రగాఢ విశ్వాసం!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2025**

* * *

**Read other books of Mr. Simha Prasad @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Simha+Prasad&id=733**